## 19 నుంచి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్



రామగిరి, డిసెంబర్ 12: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఈ నెల 19, 20 తేదీల్లో నల్లగొండలోని డాన్ బోస్కో హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు 2023-24లో జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన 113 ప్రాజెక్టులను కూడా ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రదర్శన సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర ప్రధానాంశంలో 7 ఉప అంశాలల్లో ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే అన్ని పాఠశాలలకు అందించామన్నారు. దీంతో పాటు బీఈడీ, డీఈడీ కళాశాలల ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులు తమ ఆవిష్కరణలతో కూడిన బోధన, అభ్యాసన సామగ్రిని ప్రదర్శించవచ్చని తెలిపారు. ప్రతి ప్రాజెక్టు వెంట ఒక విద్యార్థి, గైడ్ టీచర్‌కు అవకాశం ఉంటుందని, జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందుకు అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని, సెల్ 98485 78845ను గానీ సంప్రదించాలని కోరారు.

# నిర్బంధ పాలన

### శాంతియుత నిరసనలపైనా ఉక్కుపాదం

- విపక్ష నేతల కదలికలపై డేగ కన్ను
- బీఆర్ఎస్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై నిఘా
- రోడ్లెక్కితే ఎక్కడికక్కడ అరెస్టులు
- నిత్యం రోడ్లపైనే పోలీస్ పహారా
- సీఎం, ఇతర ప్రముఖుల పర్యటనల్లో ముందస్తు అరెస్టులు
- ఏడో గ్యారంటీగా చెప్తున్న ప్రజాస్వామ్యం ఉత్తదే
- మండిపడుతున్న విపక్ష నేతలు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్12(నమస్తే తెలంగాణ) : 'మా ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్తున్నారు. కానీ ఆచరణలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఉద్యమాలను, నిరసనలను ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారు. సమస్యలపై ఆయా వర్గాలు రోడ్లపైకి వస్తే అడ్డుకుంటున్నారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమైతే నిర్బంధం ప్రయోగిస్తున్నారు. 'ఇదేనా ప్రజాస్వామ్య పాలన అంటే? సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పెద్దలు ఆలోచించాలి. ప్రజలు కోరుకున్న ప్రజాపాలన ఇది కాదు. ముమ్మాటికీ ఇది నిర్బంధ పాలనే'నని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల మిర్యాలగూడలో జరిగిన ఆ పార్టీ జిల్లా మహాసభల్లో విమర్శించారు కూడా.

'కేసీఆర్ మంజూరు చేసి నిర్మించిన నల్లగొండ మెడికల్ కాలేజీని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. తర్వాత మేము అహర్నిషలు కష్టపడి, అద్భుతమైన ప్లాన్‌తో ఇష్టంగా నిర్మించిన కాలేజీ కాబట్టి ఓ సారి సందర్శించాలనుకున్నం. కానీ పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధించింది. గడియారం సెంటర్ నుంచి మెడికల్ కాలేజీ వరకు దారి పొడవునా పోలీసులు మోహరించారు. మెడికల్ కాలేజీ ముందు బారికేడ్లు పెట్టారు. కాలేజీ గేట్లకు తాళాలు వేసి సాయుధ పోలీసులను పహారా ఉంచారు. ఎవరూ అటువైపు వెళ్లకుండా బందోబస్తు పెట్టారు. మేమేమైనా గూండాలమా? విధ్వంసకారులమా? లేదంటే, మెడికల్ కాలేజీ ఏరియా నిషేధిత ప్రాంతమా?'... అంటూ నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అన్ని వర్గాలపైనా అరెస్టుల పర్వం

దాదాపు అన్ని వర్గాలు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే ఎక్కువగా పోరాటాలకు దిగుతున్నాయి. అదే ఇప్పుడు ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం తెప్పిస్తున్నది. దాంతో హామీల అమలుపై ఉద్యమాలకు సిద్ధమవుతున్న వారిని ఎక్కడికక్కడ నిర్బంధించి గొంతు నొక్కాలని చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మాజీ సర్పంచ్‌లు ఇలా వివిధ వర్గాలు తమ ఉద్యమాలను కొనసాగిస్తున్నాయి. వాటిని ఉధృతం చేసే క్రమంలో చలో హైదరాబాద్ కార్యక్రమాలకు పిలుపునిస్తే పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధం సాగిస్తున్నారు. గత వారంలో జరిగిన కొన్ని ఘటనలను పరిశీలిస్తే ప్రభుత్వం తీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

- ఈ నెల 7న నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. కాగా, ముందు రోజు సాయంత్రం నుంచే బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ మాజీ ఎమ్మెల్యేలు సహా కీలక నేతలను, ఆ పార్టీ శ్రేణులను ముందస్తు అరెస్టు చేశారు. తెల్లవారుజాము వరకే దాదాపు ముఖ్యులందరినీ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులనూ అదుపులోకి తీసుకున్నారు.
- 10వ తేదీన పెండింగ్ బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. దాంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెల్లవారుజాములోపే దాదాపు మాజీ సర్పంచ్‌లందరినీ ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు.
- అదే రోజు ఆశ వర్కర్లు చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా, వారిని సైతం జిల్లా అంతటా తెల్లవారే సరికే అరెస్టు చేశారు. జిల్లా దాటి ఎవరూ వెళ్లకుండా నిర్బంధం విధించారు. అంతకుముందు కూడా ఇలాగే పలు ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళనలకు పిలుపునిస్తే ముందస్తు అరెస్టులతో హడలెత్తించారు.



ఇటీవల అసెంబ్లీ ముట్టడికి కనగల్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు వెళ్తుండగా నల్లగొండ సమీపంలోని మర్రిగూడ బైపాస్ వద్ద అరెస్ట్ చేసి కనగల్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

### హామీలపై గొంతు నొక్కే కుట్ర

రాష్ట్రంలో ప్రజా పాలన తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్తున్న మాటలన్నీ ఉత్తివేనని ఆచరణలో తేటతెల్లమవుతున్నది. ప్రజా పాలన అంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది తిరగక ముందే నిర్బంధకాండకు తెరలేపింది. ప్రారంభంలో కొంత ఉదారంగా ఉన్నట్లు కనిపించినా రానురానూ అన్నింటికీ నిర్బంధమే సమాధానం అన్నట్లుగా వ్యవహరిస్తున్నది. కొంత కాలంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఏ చిన్న ఆందోళన జరిగినా, సమస్యలపైన ఆయా వర్గాలు రోడ్ల మీదకు వచ్చినా ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పుతున్నది. ప్రజా ఉద్యమాలను, నిరసనలు, ఆందోళనలను ఉక్కుపాదంతో అణచడమే ప్రభుత్వ ఆదేశాలు అన్నట్లుగా పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. ముందస్తు హెచ్చరికలు, అరెస్టులు, నిర్బంధాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఎన్నో హామీలు అమలుకు నోచకుండా పెండింగ్‌లో ఉన్నాయి. మొదటి ఆరు నెలలు వివిధ వర్గాలు ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించపోతుందా అని వేచి చూశారు. కానీ ఆచరణలో ప్రభుత్వ తీరు ఏ మాత్రమూ ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందితో పాటు వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుకు నిరసనగా రోడ్లమీదకు వస్తున్నారు. దశల వారీ పోరాటాల్లో భాగంగా స్థానికంగా ముందు ఆందోళనలు చేపడుతూ చివరగా చలో హైదరాబాద్, చలో అసెంబ్లీ లేదా చలో సెక్రటేరియేట్ వంటి కార్యక్రమాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది.

### ప్రజాభిప్రాయ సేకరణకూ విలువ లేకుండా..!

ఇక జిల్లాలో సీఎంతోపాటు పలు సందర్భాల్లో మంత్రుల పర్యటనల్లోనూ ముందస్తు అరెస్టులకు పాల్పడుతుండడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నది. వాటితోపాటు గతంలో రామన్నపేటలో అదానీ గ్రూప్స్‌కు చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమయంలోనూ ప్రభుత్వ తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ రోజు కూడా ఉమ్మడి జిల్లా అంతటా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్య నేతలందరినీ అరెస్టు చేశారు. విపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలను సైతం అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం ఏదైనా సరే విపక్ష నేతలపై ప్రత్యేక నిఘా పెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ వంటి పార్టీలు చేస్తున్న పోరాటాలపైనా డేగ కన్ను పెడుతున్నారు. ప్రత్యేక నిఘా వర్గాలతో కదలికపై నిరంతరం కన్నేసి ఉంచుతున్నారు. ప్రజాస్వామ్య పాలన అంటూనే ఇలా చీటికిమాటికి అరెస్టులు, నిర్బంధాలతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విపక్ష నేతలు మండిపడుతున్నారు. ప్రజాపాలన అంటే నిత్యం ప్రజల గొంతు నొక్కే కుట్రలు చేయడమేనా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యం తమ ఏడో గ్యారంటీ అని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడం కాదు... ఆచరణలోనూ పాటించాలని హితవు పలుకుతున్నారు. ఇలా అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను, విపక్ష పార్టీల కార్యకలాపాలను ఎక్కువ కాలం అడ్డుకోలేరని స్పష్టం చేస్తున్నారు.



ఈనెల 10న చలో హైదరాబాద్‌కు బయల్దేరిన ఆశ కార్యకర్తలను అరెస్టు చేసిన మద్దిరాల పోలీసులు



శాలిగౌరారంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్

## కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష

- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్
- కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

శాలిగౌరారం, డిసెంబర్ 12 : తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం, జాలోని గూడెం, పావురాలగూడెం గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ గోదల సురేశ్‌రెడ్డి, నిమ్మల సురేశ్‌గౌడ్, చీమల శంకర్‌తోపాటు పలువురు కార్యకర్తలు శాలిగౌరారం మండల కేంద్రంలో కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలకులు ప్రజలను విస్మరించి పదవుల కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. ఆయా పార్టీల విధానాలు నచ్చక బీఆర్ఎస్‌లో చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అశోక్ కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## బీఆర్ఎస్ సభ్యత్వంతో భరోసా

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, డిసెంబర్ 12 : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ బీమా సౌకర్యం భరోసాగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాస అశోక్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. అశోక్ బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో రూ.2లక్షల చెక్కు మంజూరైంది. సంబంధిత చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి అశోక్ కుటుంబ సభ్యులకు నార్కట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందించి మాట్లాడారు. దేశంలో ఏ పార్టీ అందించని విధంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన వారి కుటుంబ సభ్యులకు బాసటగా నిలువాలనే ఉద్దేశంతో ప్రమాద బీమా కల్పించిందన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, జిల్లా నాయకులు మందడి సాగర్‌రెడ్డి, కన్నెబోయిన బలరాం, ఎస్కే చాంద్, గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు గర్దాసు విక్రమ్, రవ్వ నర్సింహ, నాయకులు మంటి లింగస్వామి, రాస వెంకటేశ్వర్లు, గర్దాసు కరుణాకర్, పావుడాల వెంకటేశం, నల్ల చంద్రయ్య, పావిరాల నర్సింహ, కళ్లెం స్వామి, కర్రె శ్రీను పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూర్యాపేట, డిసెంబర్ 12 : తెలంగాణ సర్వీస్ పబ్లిక్ కమిషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 15, 16వ తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం అధికారులకు సూచించారు. పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూర్యాపేట రీజనల్ పరిధిలో 30 పరీక్ష కేంద్రాలు, కోదాడ పరిధిలో 19 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాదాపు 16,857 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12:30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4 నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండ్రోజులు నాలుగు పేపర్ల చొప్పున పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇన్విజిలేటర్లు, శాఖా పరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష పత్రాలను పూర్తి బందోబస్తుతో తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరంతో పాటు నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యం కోసం బస్సుల సమయాలను మార్చాలని ఆర్టీసీ సిబ్బందిని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. 040-67445566, 040-222335566, కంట్రోల్ రూం నంబర్ 040-24746887, 040, 24746888లను సంప్రదించాలని కోరారు.

# ఇక్కత్ ఇక్కట్లు

### పోచంపల్లి డిజైన్లకు ప్రింటెడ్ చీరల ముప్పు

- నకిలీతో సిల్క్ సిటీ బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్
- అతి తక్కువ ధరలకే డూప్లికేట్ ఇక్కత్ శారీస్ విక్రయాలు
- నేసిన ఒరిజినల్ చీరలకు తగ్గుతున్న ఆదరణ
- రోజురోజుకూ పడిపోతున్న అమ్మకాలు
- నేత కార్మికులపై జీవనోపాధిపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే గిరాకీల్లేక కొట్టుమిట్టాడుతున్న చేనేత పరిశ్రమ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చీరలకు గడ్డుకాలం దాపురించిందా..? పోచంపల్లి డిజైన్లకు ప్రింటెడ్ చీరలు ముప్పుగా మారాయా..? ప్రింటెడ్ చీరల తయారీ సిల్క్ సిటీ బ్రాండ్ ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తుందా..? ప్రభుత్వం చొరవ చూపకపోతే వేలాది మంది నేతన్నల జీవనోపాధిపై ప్రభావం పడుతుందా..? అంటే.. అవునని చెప్పక తప్పదు. జియో ట్యాగ్, పేటెంట్ కలిగిన పోచంపల్లి డిజైన్లకు దీటుగా నకిలీ ప్రింటెడ్ చీరలు జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా నేతన్నల జీవనోపాధి పై ప్రభావం చూపుతున్నది

*– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)/ భూదాన్ పోచంపల్లి*





పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరలు





పోచంపల్లి ఇక్కత్‌ను పోలిన ప్రింటెడ్ చీరలు

పోచంపల్లి.. ఇక్కత్ పట్టు చీరకు పెట్టింది పేరు. ఆ చీరలు ప్రత్యేకంగా పోచంపల్లిలోనే పుట్టాయని చెప్తుంటారు. చీరలకు చేతులతో రంగులు వేసే సంప్రదాయ పద్ధతినే ఇక్కత్ అని పిలుస్తుంటారు. చీరకు ఎక్కడ రంగు వేయాలో ముందే ఊహించుకొని.. దారాలకు రంగులేసి, రకరకాల డిజైన్లను నేస్తారు. పోచంపల్లి బ్రాండ్ పేరుతో పేటెంట్ కలిగిన ఈ పట్టు చీరల తయారీలో వేలాది మంది నేతన్నలు భాగస్వాములై ఉన్నారు. ఇక్కడ ఇక్కత్ పట్టు చీర నాణ్యత, మన్నిక, డిజైన్లు ప్రపంచవ్యాప్తంగా మగువల మనసు దోచుకుని, వారి ఆదరణను పొందాయి. అయితే ఇంతటి ఘన చరిత్ర కలిగిన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీర ప్రస్తుతం ఇబ్బందులు పడింది. జియోగ్రాఫికల్ వెరిఫికేషన్ ట్యాగ్ కలిగిన కూడా ఇక్కత్ డిజైన్లను కూడా కొందరు బడా వ్యాపారులు కాపీ కొట్టి ప్రింటింగ్ పాలిస్టర్ చీరలు తయారుచేసి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో పోచంపల్లి ఇక్కత్ మనుగడకు ప్రమాదం ఏర్పడింది.

### నకిలీ చీరలు ఇలా..

పోచంపల్లి ఇక్కత్ నకిలీ చీరలు జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. కొంత మంది సాదా చీర నేసి.. దానిపై.. హైదరాబాద్ లో ప్రింట్ వేయిస్తున్నారు. ఇదే డిజైన్ మగ్గంపై నేస్తే రూ. 13వేలకు విక్రయిస్తారు. కానీ ప్రింటెడ్ చీరలు మాత్రం 10వేల లోపే అమ్ముతున్నారు. ఇక గత కొంత కాలంగా గుజరాత్ లోని సూరత్ కేంద్రంగా ప్రింటెడ్ పాలిస్టర్ చీరలు బహిరంగ మార్కెట్ లో ముంచెత్తుతున్నాయి. పోచంపల్లి కేంద్రంగా తయారయ్యే పట్టుచీరలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. అలాంటి పట్టుచీరలకు డిజైన్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ చేసి తక్కువ ధరకు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో ఏది అసలు.. ఏది నకిలీనో గుర్తించలేకపోతున్నారు. పలు సందర్భాల్లో ఆన్ లైన్ లో మోసాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడునేతల నేసే పేరుతో వస్తున్న ప్రింటడ్, పాలిస్టర్ చీరలు 600 నుంచి 1000 మధ్య అందుబాటులో ఉంటున్నాయి.

### పడిపోతున్న విక్రయాలు..

ప్రింటెడ్ చీరలతో చేనేత పరిశ్రమకు నష్టం వాటిల్లుతున్నది. పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరల డిజైన్లతో వచ్చిన పాలిస్టర్ చీరల కారణంగా పోచంపల్లి నేతన్నలు కష్టపడి మగ్గంపై నేసిన చీరలు క్రమక్రమంగా డిమాండ్ తగ్గుతున్నది. నేతన్నలు నేసే పట్టు చీరల అమ్మకాలు రోజురోజుకు పడిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో నేతన్నల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. అసలే గిరాకీ లేక చేనేత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. నేసిన చీరలు టెస్కో సరిగా కొనుగోలు చేయడం లేదు. దీంతో చేనేత నిల్వలు భారీగా పెరిగిపోతున్నాయి.

### నేతన్నల జీవనోపాధిపై దెబ్బ..

నకిలీ చీరలతో పట్టు చీరల బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్ కావడంతో పాటు చేనేత వృత్తిదారుల జీవనోపాధి దెబ్బతింటున్నది. జిల్లాలో సుమారు 11వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. నేతన్న నేసే పట్టు చీర డిజైన్ బట్టి గరిష్టంగా రూ. 20వేల దాకా పలుకుతుండగా, కాపీ చేసి ప్రింట్ చేసిన చీరలు బహిరంగ మార్కెట్ అతి తక్కువ ధరలకే లభ్యవుతున్నాయి. దీంతో వినియోగదారులు ప్రింటెడ్ చీరల వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఉపాధి లభించని పరిస్థితి దాపురిస్తున్నది. అందరికీ పని దొరకని దుస్థితి నెలకొంది. గిరాకీ లేకపోవడంతో చేసిన పనికి కూలి డబ్బులు కూడా సకాలంలో చెల్లించడం లేదు. దీంతో కార్మికుల జీవనం దుర్భరంగా మారుతున్నది. ప్రింటెడ్ చీరలను అరికట్టాలని చేనేత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోచంపల్లికే పరిమితమైన చేనేత డిజైన్లు జియో ట్యాగ్, పేటెంట్ హక్కు ఉన్న ఇక్కత్ డిజైన్లు కాపీకి గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

### నకిలీ చీరలను అరికట్టాలి



పోచంపల్లి పట్టు చీరలో అంచు బార్డర్ సాదా చీరలు తయారు చేయించి మధ్యన ప్రింటెడ్ డిజైన్లు వేస్తున్నారు . పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు నకిలీ చీరలు ప్రింట్ చేసి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి నకిలీ చీరలతో కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది . వ్యాపారస్తులు ఏ వ్యాపారమైనా చేయొచ్చు కానీ నేత కార్మికులు ఇదే వృత్తిలో కొనసాగుతారు . పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు నకిలీ చీరలు తయారీదారులు విక్రయిదారులపై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

*-ఏలె భిక్షపతి , రాష్ట్ర చేనేత నాయకులు, భూదాన్ పోచంపల్లి*

### చీరల గిరాకీ లేదు



చేనేత పరిశ్రమ సంక్షోభంతో నేసిన వస్త్రాలు అమ్ముడుపోక కార్మికులకు పని కల్పించడం లేదు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లతో ప్రింటెడ్ వస్త్రాలతో గిరాకీ లేక నేసిన వస్త్రా నిల్వలు పేరుకపోతున్నాయి. పనులు లేక వలసలు వెళ్లే దుస్థితి నెలకొంటుంది. వేరే పని చేయలేక చేనేత పనిచేస్తూ అప్పుల భారంలో కూరుకుపోతున్నా. ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

*-దుద్యాల పాపయ్య, చేనేత కార్మికుడు భూదాన్ పోచంపల్లి*

### ప్రింటెడ్ చీరలతో ఇక్కత్‌కు ఇక్కట్లు



పోచంపల్లి ఇక్కత్ డిజైన్లకు ముప్పుగా ప్రింటెడ్ చీరలు డిజైన్లు కాపీ కొట్టడంతో ఫ్రంట్ చీరలు అతి తక్కువ ధరకే దొరుకుతున్నాయి. ఇక్కత్ పట్టు చీరలు పదివేల రూపాయలకు దొరుకుతుండగా 600 నుండి వెయ్యి రూపాయల వరకు ప్రింటెడ్ చీరలు లభ్యమవుతున్నాయి. దీంతో వినియోగదారులు ప్రింటెడ్ చీరల వైపు మొగ్గు చూపుతారు. పట్టు చీరల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుంది . చేనేత వృత్తిదారులు పనిలేక నష్టపోతురు. పెద్దపెద్ద షాపింగ్ మాల్ లో ప్రింటెడ్ చీరలు అమ్ముతుర్రు. పట్టు చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు సూరత్ నుంచి వస్తున్నాయి. ప్రింటెడ్ చీరలను నియంత్రించాలి . చేనేత ఇక్కత్ వృత్తిని పరిరక్షించాలి. కార్మికులందరికీ పని కల్పించాలి.

*-చింతకింది రమేశ్, అధ్యక్షుడు రాష్ట్ర చేనేత జన సమాఖ్య, భూదాన్ పోచంపల్లి*

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకతవకలు

- మెరిట్ లిస్ట్‌లో ఉన్నవారిని కాదని అనర్హురాలికి మోడల్ స్కూల్ కేర్ టేకర్ పోస్టు!
- సంస్థాన్ ఎంఈఓ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా




ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధిత యువతులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో కేర్ టేకర్ ఉద్యోగ్యాన్ని అనర్హురాలికి కేటాయించారని బాధితులు గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆరు గంటలపాటు ధర్నా చేశారు. మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కేర్ టేకర్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ ఉద్యోగాలకు అక్టోబర్ 8న దరఖాస్తులు తీసుకున్నారు. అదే నెల 23న మెరిట్ ప్రాతిపదికన 1:3 పద్ధతిలో ఇంటర్వ్యూలకు పిలిచారు. కానీ, ఆ రోజు ఇంటర్వ్యూ నిర్వహించకుండా రెండ్రోజుల తర్వాత పిలుస్తామని చెప్పి అభ్యర్థులను ఎంఈఓ శ్రీనివాస్ పంపించారు. అప్పటి నుంచి అభ్యర్థులు ఆఫీసు చుట్టూ తిరుగుతుండగా, ఎంఈఓ మాత్రం పొంతలేని సమాధానాలతో నెట్టుకొచ్చారు. కాగా, అప్పటికే కేర్ టేకర్ ఉద్యోగానికి మెరిట్ లిస్ట్‌లో ఉన్న వారిని కాదని కనీసం ఇంటర్వ్యూకు కూడా హాజరుకాని అనర్హురాలికి ఉద్యోగం కేటాయించడం జరిగింది. ఆమెకు కేజీబీవీ ఎస్ఓ శివరంజిని గురువారం ఉదయం ఫోన్ చేసి ఉద్యోగంలో జాయిన్ అవ్వాలని చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో మొదటి మూడు స్థానాల్లో ఉన్న అభ్యర్థులు విషయం తెలుసుకుని ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో మెరిట్ లిస్ట్‌లో ఉన్న వారిని కాదని అనర్హులకు ఉద్యోగం ఎలా కేటాయిస్తారని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం జరిగే వరకు ఊరుకోబోమని కార్యాలయం ఎదటు కూర్చున్నారు. ప్రతిభ ఉన్న వారిని కాదని రాజకీయ ఒత్తిళ్లతో అనర్హులకు ఉద్యోగాలు ఇవ్వద్దని వేడుకున్నారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీనివాస్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. కేర్ టేకర్ ఉద్యోగానికి గతంలో 1.3 ప్రకారం మెరిట్ లిస్టులో ఉన్నావారిని ఇంటర్వ్యూకు పిలిచిన మాట వాస్తమేనన్నారు. కానీ, ఎంపిక తనకు తెలియకుండానే జరిగిందని, ఆర్డర్ కాపీ వచ్చిన విషయం కూడా తనకు తెలియదని పేర్కొనడం గమనార్హం.

### మెరిట్ లిస్ట్‌లో ముందున్న నాకు అన్యాయం చేయొద్దు



మాది నిరుపేద కుటుంబం. నాన్న చనిపోవడంతో అమ్మ కూలీ పనులు చేస్తూ చదివించింది. నేను చిన్నతనం నుంచి ప్రభుత్వ హాస్టళ్లలో ఉండే చదువుకున్నాను. బీఈడీ పూర్తి చేశాను. మోడల్ స్కూల్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కేర్ టేకర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ లిస్ట్‌లో ఫస్ట్ నా పేరే ఉంది. ఇంటర్వ్యూకు కూడా వెళ్లాను. ఇప్పుడు మెరిస్ట్ లిస్ట్‌లో లేనివారి వారికి ఉద్యోగం ఇవ్వడం అన్యాయం. నిరుద్యోగుల జీవితాలతో రాజకీయ నాయకులు ఆడుకోవద్దు.

*-బర్ల స్వాతి, బాధిత యువతి*